
సాక్షి
సూర్యాపేట
గురువారం । 3 । జూలై । 2025



లైబ్రేరియన్ పోస్టుల భర్తీ
ఖాళీగా ఉన్న లైబ్రేరియన్ పోస్టులు భర్తీ చేస్తామని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ రియాజ్ అన్నారు. - 8లో



రూ.3వేలు.. 200 ట్రిప్పులు
టోల్‌ప్లాజాల రాకపోకలు సులభతరం చేసేలా కేంద్ర ప్రభుత్వం నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. - 8లో



పాలు పొంగించి..
ఇందిరమ్మ ఇంట్లో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ప్రభుత్వ విప్ అయిలయ్య పాలుపొంగించారు. - 8లో

న్యూస్‌రీల్

ఎంజీయూ డిగ్రీ పరీక్షల ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ ఖాజాఅల్తాఫ్ హుస్సేన్

నల్లగొండ టూటౌన్ : నల్లగొండలోని ఎంజీ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ రెగ్యులర్, బ్యాక్ లాగ్ పరీక్షల ఫలితాలను వీసీ ఖాజాఅల్తాఫ్ హుస్సేన్ బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఈఓ డాక్టర్ ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ డిగ్రీ మొదటి సెమిస్టర్‌లో 21.76 శాతం , రెండవ సెమిస్టర్ 23.56 శాతం, మూడో సెమిస్టర్‌లో 31.08 శాతం, నాలుగో సెమిస్టర్‌లో 36.05 శాతం, ఐదవ సెమిస్టర్‌లో 37.03 శాతం, ఆరవ సెమిస్టర్‌లో 46.07 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఫలితాల పూర్తి వివరాలను యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ అల్వాల రవి, కోఆర్డినేటర్లు లక్ష్మీప్రభ, ప్రవళిక, భిక్షమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య తెలంగాణే లక్ష్యం



యోగా సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఆయుష్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ రవినాయక్

అనంతగిరి: ఆరోగ్య తెలంగాణే లక్ష్యమని ఆయుష్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రవి నాయక్ అన్నారు. అనంతగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయుష్ కేంద్రానికి అనుసంధానంగా నిర్మించిన యోగా సెంటర్‌ను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. సూర్యాపేట జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో 12 ఆయుష్ యోగా కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు రాగా ప్రస్తుతం 11 యోగా కేంద్రాలను నిర్మించినట్లు వివరించారు. ఒక్కో యోగా కేంద్రానికి రూ.6లక్షల నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ రామకృష్ణ, అనంతగిరి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్, యోగా శిక్షకులు వినయ్, ఎమ్మార్పీఎస్ నాయకులు బొడ్డు కుటుంబరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య



మాట్లాడుతున్న జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి భానునాయక్

తిరుమలగిరి : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి భానునాయక్ పేర్కొన్నారు. బుధవారం తిరుమలగిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి మాట్లాడారు. అడ్మిషన్లు పెంచడానికి అధ్యాపకులు కృషి చేయాలని కోరారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాజమోహన్, బాల్తా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థుల రక్షణ మన బాధ్యత

సూర్యాపేటటౌన్ : హాస్టల్ విద్యార్థుల రక్షణ మన బాధ్యత అని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నిద్ర సంపత్ నాయుడు పేర్కొన్నారు. జిల్లాకు కేటాంచిన నూతన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లను బుధవారం సూర్యాపేట పట్టణంలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు హాస్టల్ విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలన్నారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

కోదాడరూరల్: విధులకు ఎగనామం పెట్టిన కోదాడ పట్టణ పరిధిలోని శ్రీరంగాపురం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిపై డీఈఓ సస్పెన్షన్ వేటు వేసినట్లు ఎంఈఓ సలీం షరీఫ్ బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఉపాధ్యాయుడు పోటు రవి ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకుండా గత నెల 21 నుంచి విధులకు హాజరు కావడం లేదనే విషయం పాఠశాల తనిఖీకి వెళ్లినప్పుడు తెలిసిందని తెలిపారు. దీనిపై డీఈఓకు లిఖితపూర్వకంగా నివేదిక అందజేయడంతో విచారణ చేపట్టిన ఈ చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.



ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, చిత్రంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి తదితరులు

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్
- ఉమ్మడి జిల్లా అభివృద్ధిపై నల్లగొండ కలెక్టరేట్‌లో సమీక్ష
- హాజరైన మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు
- ఆయా రంగాల్లో ప్రగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించిన కలెక్టర్లు

ప్రజా ప్రభుత్వం.. సంక్షేమమే ధ్యేయం

పథకాల అమలు తీరును అధికారులు పర్యవేక్షించాలి

నల్లగొండ : అధికారులు క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాలను పర్యవేక్షించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా అభివృద్ధిపై బుధవారం నల్లగొండ కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో ఆయా జిల్లాల కలెక్టర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులతో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ తమది ప్రజా ప్రభుత్వమని ప్రజల కోసం అమలు చేసే ప్రతి సంక్షేమ పథకాన్ని క్షేత్రస్థాయిలో అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం ద్వారా అర్హులకు మేలు జరుగుతుందన్నారు. జిల్లాకు చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారుల సహకారంతో జిల్లా అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. రైతులకు సంబంధించిన అంశాలను మండలస్థాయి అధికారులతో జిల్లా అధికారులు రోజూ పర్యవేక్షించాలన్నారు. రైతు భరోసా, బీమా, ఎరువులు, విత్తనాల విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విద్యుత్ కనెక్షన్లకు సంబంధించి ఎమ్మెల్యేల విజ్ఞప్తి మేరకు సమస్యలు లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన సేవలు అందించి సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా అభివృద్ధికి 15 రోజులకోసారి సమావేశం ఏర్పాటుచేస్తామన్నారు. సమావేశంలో ఎంపీలు కిరణ్‌కుమార్‌రెడ్డి, కుందూరు రఘువీర్‌రెడ్డి, మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ చైర్మన్ అమిత్‌రెడ్డి, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, యాదాద్రి జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, నల్లగొండ ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్ పాల్గొన్నారు.

అవినీతికి ఆస్కారం ఉండొద్దు
– మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



జిల్లా ఇన్‌చార్జి మంత్రి లక్ష్మణ్‌కుమార్.. మంత్రులు, ప్రజాప్రతినిధులు అధికారులను సమన్వయం చేసుకుంటూ జిల్లాను ఉన్నత స్థానంలో నిలపాలని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి కోరారు. పేదలకు సన్న బియ్యం ఇస్తున్న ఏకైక ప్రభుత్వం తమదే అన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల పూర్తికి కృషి చేస్తామన్నారు. బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టు పదేళ్లు నిర్లక్ష్యానికి గురైందని.. మంత్రి కోమటిరెడ్డి సహకారంతో త్వరలోనే పూర్తి చేసి లక్ష ఎకరాలకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఎస్ఎల్‌బీసీ పనులను పునః ప్రారంభించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. డిండి ప్రాజెక్టుకు నీటి కేటాయింపులు లేవని.. మేము వచ్చాకే నీటికేటాయింపులుచేసి నిధులు కూడా మంజూరు చేశామన్నారు. పిలాయిపల్లి, ధర్మారెడ్డిపల్లి, బునాదిగాని కాల్వలతో పాటు లిఫ్టులు, హైలెవల్ కెనాల్ లైనింగ్‌కు రూ.400 కోట్లు మంజూరు చేశామన్నారు. అయిటిపాముల, గంధమల్ల రిజర్వాయర్లకు రూ.500 కోట్లు మంజూరు చేసి సీఎంతో పనులు ప్రారంభించామన్నారు. రాచకాల్వ మరమ్మతు పనులు చేయాలని ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి కోరారని వాటికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. ప్రభుత్వ పథకాల అమలులో అవినీతికి ఆస్కారం లేకుండా చూడాలని అధికారులకు సూచించారు.

నాణ్యమైన విద్య, వైద్యం అందించాలి
– మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం అందించడం మొదటి ప్రాధాన్యంగా తీసుకోవాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆర్అండ్‌బీ శాఖ ద్వారా జిల్లాకు ఎక్కువ నిధులు తెచ్చామని.. భవిష్యత్‌లో మరిన్ని నిధులు తెస్తామన్నారు. మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రానికి డబుల్ రోడ్లను ఏర్పాటు చేస్తామన్నారు. సంగెం బ్రిడ్జికి రూ.45 కోట్లు మంజూరు చేశామన్నారు. ఎస్ఎల్‌బీసీ పూర్తికి చిత్తశుద్ధితో కృషి చేస్తామన్నారు. ఎస్‌డీఎఫ్ కింద ప్రతి ఎమ్మెల్యేకు వెంటనే రూ.5 కోట్లు మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. నల్లగొండ కలెక్టరేట్‌లో చేపట్టిన అదనపు బ్లాక్ నిర్మాణాన్ని ఎనిమిది నెలల్లో పూర్తి చేస్తామన్నారు.

ప్రగతిపై కలెక్టర్ల వివరణ



సమావేశంలో ముందుగా నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి, సూర్యాపేట కలెక్టర్ తేజస్ నందలాల్‌పవార్, యాదాద్రి కలెక్టర్ హనుమంతరావు.. ఆయా జిల్లాలో నీటిపారుదల, విద్యా, వ్యవసాయం, వైద్యం, మహిళా శక్తి, సంక్షేమం తదితర అంశాల్లో ప్రగతి, చేపడుతున్న కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రులు, ప్రజాప్రతినిధులకు వివరించారు.

మాట్లాడుతున్న సూర్యాపేట కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ ఏమన్నారంటే..

- ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ కాళేశ్వరం 15వ ప్యాకేజీ కింద 8 కిలోమీటర్ల కాల్వ తవ్వితే 20 చెరువులకు నీరొస్తుందని కొత్త డీపీఆర్‌కు అనుమతి ఇవ్వాలని కోరారు. తెలంగాణ గ్రామీణ బ్యాంకుల్లో ఖాతా ఉన్న రైతులకు ఐఎఫ్‌సీ కోడ్ వల్ల నిధులు వెనక్కు వెళ్లాయని ప్రభుత్వంతో మాట్లాడి సమస్య పరిష్కరించాలన్నారు.
- భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ బస్వాపూర్ పునరావాస కేంద్రానికి నిధులు ఇవ్వాలని కోరారు.
- నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఇరిగేషన్ ప్రాజెక్టులకు ట్రాన్స్‌కో బిల్లులు మంజూరు చేయాలని కోరారు. డొంకతండా, బోయగూడెం గ్రామాల్లో సంక్షేమ పథకాలకు సంబంధించిన దరఖాస్తులు కనిపించడం లేదని, వెబ్‌సైట్‌ను మరోసారి ఓపెన్ చేసి దరఖాస్తులు తీసుకోవాలన్నారు.
- తుంగతుర్తి ఎమ్మెల్యే సామేల్ మాట్లాడుతూ రాచకాల్వకు ఇన్‌చార్జి ఇంజనీరింగ్ అధికారిని నియమించాలని కోరారు.
- దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ పెండ్లిపాకల, డిండి ఎత్తిపోతల పథకాలు పూర్తి చేయాలన్నారు.
- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతు బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టు భూసేకరణకు నిధులు మంజూరు చేయాలని, పిలాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వకు శంకుస్థాపన చేయాలని కోరారు.
- ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ మునుగోడు పరిధిలో ప్రాజెక్టులను పూర్తి చేయాలని, రెండో విడతలో ఎక్కువ మందికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని కోరారు.

ప్రజలకు ఉచిత న్యాయ సలహాలు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఫర్హీన్ కౌసర్

చివ్వెంల(సూర్యాపేట) : ప్రజలకు ఉచిత న్యాయ సలహాలు అందించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఫర్హీన్ కౌసర్ ప్యానల్ న్యాయవాదులు, డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులకు సూచించారు. బుధవారం సూర్యాపేట జిల్లా కోర్టు ప్రాంగణంలోని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో ప్యానల్ న్యాయవాదులు, డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సమావేశంలో డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు బొల్లెద్దు వెంకటరత్నం, బట్టిపల్లి ప్రవీణ్ కుమార్, పెండెం వాణి, న్యాయవాదులు సీనపల్లి సోమేశ్వర్, శ్రీనివాస్, పత్తిపాక శ్రీనివాస్‌రావు, కోక రంజిత్ కుమార్, రాచకొండ యాదగిరి, పల్లేటి రాముడు, బచ్చలకూరి గోపి, శంకరయ్య పాల్గొన్నారు.

బాధితుల ఫిర్యాదులపై వేగంగా స్పందించాలి

- ఎస్పీ నరసింహ

చిలుకూరు : పోలీస్ స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదుపై వేగంగా స్పందించాలని జిల్లా ఎస్పీ కె.నరసింహ ఆదేశించారు. బుధవారం చిలుకూరు పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. నమోదవుతున్న కేసుల స్థితిగతులు, ఫిర్యాదుల తీరుతెన్నులను పోలీసులను అడిగి తెలుసుకున్నారు. పోలీసులు.. ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజల భాగస్వామ్యంతో ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. రహదారి భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణపై కూడా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎస్పీ వెంట ఎస్ఐ రాంబాబు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



చిలుకూరు పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ నరసింహ

వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సూర్యాపేటటౌన్ : వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ నరసింహ బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. ప్రయాణ సమయంలో వాహనదారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకొని రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా గమ్యం చేరుకోవాలని కోరారు. వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, కూలీలు విద్యుత్ తీగలు, స్తంభాలకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న కాల్వలు, నదుల్లోకి చేపలు పట్టడానికి ఎవరూ వెళ్లకూడదని సూచించారు. విద్యార్థులను రవాణా చేసే వాహనాలను డ్రైవర్లు జాగ్రత్తగా నడపాలని కోరారు. రోడ్లపై అతివేగంతో వాహనాలు నడపవద్దని హితవుపలికారు. అత్యవసర సమయంలో పోలీస్ సేవలు పొందడానికి డయల్ 100 కు లేదా సూర్యాపేట జిల్లా పోలీస్ కంట్రోల్ రూం నంబర్ 8712686026 కు ఫోన్ చేయాలని సూచించారు. పోలీస్ సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కోరారు.

సాగర్‌లో పెరుగుతున్న నీటిమట్టం

- శ్రీశైలంలో విద్యుదుత్పత్తి ద్వారా దిగువకు నీటి విడుదల
- సాగర్ జలాశయానికి చేరుతున్న 50వేల క్యూసెక్కుల నీరు
- ఆయకట్టులో సాగుకు సిద్ధమవుతున్న అన్నదాతలు



నాగార్జునసాగర్, మిర్యాలగూడ : కర్నాటక, మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలకు కృష్ణమ్మ జలకళ సంతరించుకుంది. ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది మే నెలలోనే జూరాల ప్రాజెక్టు రేడియల్ క్రస్ట్‌గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. ఎగువ నుంచి వరద కొనసాగుతుండడంతో ప్రస్తుతం శ్రీశైలం జలాశయానికి రోజూ లక్ష క్యూసెక్కులకు పైగా వరద వస్తోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం క్రమంగా పెరుగుతుండడంతో అక్కడి కుడి, ఎడమ విద్యుదుత్పాదన కేంద్రాల ద్వారా మంగళవారం నుంచి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. నిత్యం సుమారు 50వేల క్యూసెక్కుల నీరు సాగర్ జలాశయానికి వస్తుండడంతో సాగర్ జలాశయం నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. దీంతో సాగర్ ఆయకట్టుకు ఈ ఏడాది ముందుగానే నీటిని విడుదల చేసే అవకాశం ఉంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఈ నెల చివరి వారంలో నీటి విడుదలకు అవకాశం

సాగర్ జలాశయ గరిష్టస్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.0450 టీఎంసీలు) కాగా.. జూన్ మొదటి వారంలో 511.80 అడుగులు (134.7466 టీఎంసీలు)గా ఉంది. బుధవారం నాటికి 517.60 అడుగులకు (144.9362టీఎంసీలు) చేరింది. సాగర్ నీటిమట్టం 540 అడుగులకు చేరి, ఎగువన గల జలాశయాలు గరిష్టస్థాయిలో ఉండి, నదిలో 70 నుంచి 100టీఎంసీల నీరు ఉంటే సాగర్ ఆయకట్టుకు నీటిని విడుదల చేసే అవకాశం ఉంటుంది. సాగర్ కుడి, ఎడమ కాల్వల కింది 22,12,670 ఎకరాల ఆయకట్టు ఉంది. భూగర్భ జలాలు పెరిగి.. బోర్లు, బావులు, వాగుల ద్వారా మరో లక్ష ఎకరాలు సాగవుతుంది. కుడి, ఎడమ కాల్వల కింద సాగుకు 132 టీఎంసీల చొప్పున 264 టీఎంసీల నీటిని విడుదల చేయాల్సి ఉంటుంది. గడిచిన పదేళ్లలో ఏడు సార్లు ఆగస్టు మాసంలోనే ఆయకట్టుకు నీటిని విడుదల చేశారు. 2017లో అక్టోబర్ నెలలో విడుదల చేశారు. 2015, 2023 సంవత్సరాల్లో కృష్ణాబేసిన్‌కు వరదలు రాక జలాశయాలకు నీరు చేరకపోవడంతో కాల్వలకు నీరివ్వలేదు. ఈ ఏడాది ముందుగానే జలాశయాలకు నీరు చేరుతుండటంతో జూలై చివరి వారం లేదా ఆగస్టు మొదటి వారంలో నీటిని విడుదల చేసే అవకాశాలున్నాయి.

గత పదేళ్లుగా నీటి విడుదల వివరాలు ఇలా..

సంవత్సరం	నీటిమట్టం	విడుదల తేదీ
2014	515	ఆగస్టు 6
2015	510	నీటి విడుదల లేదు
2016	514	ఆగస్టు 26
2017	576	అక్టోబర్ 31
2018	555	ఆగస్టు 23
2019	556	ఆగస్టు 11
2020	556	ఆగస్టు 7
2021	585	ఆగస్టు 5
2022	555	ఆగస్టు 31
2023	506	నీటి విడుదల లేదు
2024	585	ఆగస్టు 2

సాగు పనుల్లో ఆయకట్టు రైతులు

సాగర్‌కు వరద వస్తుండడంతో సాగునీటి విడుదలకు ఢోకా ఉండదనే ధీమాతో ఆయకట్టు పరిధిలో రైతులు సాగుకు సిద్ధమవుతున్నారు. దుక్కులు దున్ని నార్లు పోసుకుంటున్నారు. వరద ఇలాగే వస్తే ఈ వానాకాలం సీజన్‌తోపాటు యాసంగి సీజన్‌లో కూడా గట్టెక్కినట్లేనని రైతులు భావిస్తున్నారు.

సాగర్‌కు నీటి రాక మొదలైంది

నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద నీరు వస్తోంది. మంగళవారం సాయంత్రం 6 గంటల నుంచి సుమారు 50 వేల క్యూసెక్కుల నీరు వస్తోంది. నీటి రాక మరింత పెరిగే అవకాశం ఉంది. ఎన్నడూ లేని విధంగా ముందుగానే సాగర్ ప్రాజెక్టుకు వరద నీరు వస్తోంది.

– మల్లికార్జున్, ఎస్ఈ, సాగర్‌డ్యాం

100 అడుగుల జెండా ఏర్పాటు అభినందనీయం



వార్షికోత్సవానికి హాజరైన ఐవీఓ జాతీయ అధ్యక్షుడు సెంగార్, తదితరులు

కోదాడరూరల్ : కోదాడ పట్టణంలో 100 అడుగుల జాతీయ జెండా ఏర్పాటు చేయడం అభినందనీయమని ఇండియన్ వెటరన్ ఆర్గనైజేషన్(ఐవీఓ) జాతీయ అధ్యక్షుడు జే.ఎస్. సెంగార్ అన్నారు. కోదాడలో ఐవీఓ ఆధ్వర్యంలో 100 అడుగుల జాతీయ జెండా ఏర్పాటు చేసి ఏడాది పూర్తి అయిన సందర్భంగా బుధవారం నిర్వహించిన వార్షికోత్సవంలో ఐవీఓ రాష్ట్ర అధ్యక్షుడు ఉజ్జిని రవీందర్, జిలా అధ్యక్షుడు గుండా మధుసూదన్‌రావులతో కలిసి సెంగార్ పాల్గొని మాట్లాడారు. మాజీ సైనికులు కలిసి ఏర్పాటు చేసిన జాతీయ జెండా రాష్ట్రంలో కోదాడదే ప్రథమం అని తెలిపారు. ప్రజల్లో దేశభక్తిని పెంపొందించేందుకు జాతీయ జెండా ఏర్పాటుకు ముందుకు వచ్చిన కోదాడవాసుల ఆర్థిక సహాయం ఎంతోగొప్పదని కొనియాడారు. అంతకుముందు కార్గిల్ యుద్ధవీరుడు గోపయ్య వర్ధంతి సందర్భంగా కోదాడ పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎన్‌సీసీ విద్యార్థినుల కవాతు, సాంస్కృతిక ప్రదర్శనలు ప్రజలను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఐవీఓ వైస్ ప్రెసిడెంట్ రామారావు, జనరల్ సెక్రటరీ ఉపేందర్, ట్రెజరర్ వెంకన్న , మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల, ప్రవళిక, నాగేశ్వరరావు, ఎంఈఓ సలీం షరీఫ్ పాల్గొన్నారు.



ఎన్‌సీసీ విద్యార్థినుల నృత్య ప్రదర్శన

ఎత్తిపోసేది ఎప్పుడు..?

- రూ.47.64కోట్లతో రెడ్లకుంట వద్ద పాలేరు వాగుపై ఎత్తిపోతల పథకం
- పనులు ప్రారంభించి ఏడాది దాటినా కానరాని పురోగతి
- జాప్యంపై మంత్రి ఉత్తమ్ అసహనం
- అక్టోబర్ చివరి నాటికి పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం



రెడ్లకుంటలో కొనసాగుతున్న లిఫ్ట్ పనులు

కోదాడరూరల్ : రైతులకు సాగు నీరు అందించాలన్న లక్ష్యంతో చేపట్టిన రెడ్లకుంట ఎత్తిపోతల పథకం పనులు రెండడుగులు ముందుకు మూడడుగులు వెన్నక్కి అన్న చందంగా సాగుతున్నాయి. పనులు ప్రారంభించి ఏడాది గడిచినా ఎలాంటి పురోగతిలేదు. వారం రోజుల క్రితం పనులను పరిశీలించిన నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి.. ఇరిగేషన్ అధికారులు, కాంట్రాక్టర్‌పై అసహనం వ్యక్తం చేశారు. మూడు నెలల్లో పూర్తి చేయాలని వారిని ఆదేశించారు.

గత ఏడాది మార్చిలో శంకుస్థాపన

నాగార్జున సాగర్ ఎడమ కాల్వపై ముక్త్యాల బ్రాంచ్ కెనాల్‌కు అనుసంధానంగా రెడ్లకుంట మేజర్ ద్వారా నల్లబండగూడెం, కాపుగల్లు, కూచిపూడి గ్రామాలకు నీరు అందాల్సి ఉంది. అయితే ఆయా గ్రామాలు మేజర్ కాల్వ ఆయకట్టు చివరన ఉండటంతో నీరందక రైతులు ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రెడ్లకుంటతో పాటు ఆయా గ్రామాల రైతులు గతంలో అనేక సార్లు సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు తమ సమస్యను తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిల సహకారంతో ప్రభుత్వం రెడ్లకుంట వద్ద పాలేరు వాగుపై లిఫ్ట్ నిర్మాణానికి రూ.47.64 కోట్ల నిధులు మంజూరు చేసింది. గత ఏడాది మార్చిలో లిఫ్ట్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈపనులు పూర్తయితే ఆయా గ్రామాల్లో 4,600 ఎకరాలకు సాగునీటి సమస్య తీరనుంది.

నత్తనడకన పనులు

లిఫ్ట్ పనుల్లో భాగంగా పైప్‌లైన్ వేయాల్సి ఉంది. రెడ్లకుంట వద్ద పాలేరు వాగుపై నీళ్లు ఎత్తిపోసేందుకు విద్యుత్ మోటారు బిగించాల్సి ఉంది. విద్యుత్‌లైన్ ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ ఈ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇప్పటి వరకు వాగు నుంచి 200మీటర్ల లోపు వరకు పైప్‌లైన్ కోసం గాతు తీసి వదిలేశారు. మిగతా పనులు అసలు మొదలే పెట్టలేదు.

మంత్రి ఆదేశాలతోనైనా..

వారం రోజుల క్రితం లిఫ్ట్ నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఈ ఏడాది అక్టోబర్ నాటికి పనులు పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తేవాలని అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. అయితే అక్కడ వాస్తవ పరిస్థితిని చూస్తే మంత్రి ఇచ్చిన గడువు లోపు పనులు పూర్తయ్యే పరిస్థితులు కనబడటం లేదు. వర్షాలు పడితే పనులు చేయడం కష్టంగా మారుతుంది. పనులు ఇలా నిదానంగా కొనసాగితే మరో ఏడాదైనా పూర్తి కాకపోవచ్చని రైతులు పేర్కొంటున్నారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

కోదాడరూరల్: వాకింగ్‌కు వెళ్లిన యువకుడు ప్రమాదవశాత్తు కాలు జారి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై పడి విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. ఈ ఘటన కోదాడ పట్టణ పరిధిలోని ఉత్తమ్‌పద్మావతినగర్ కాలనీలో హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు వద్ద బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ పట్టణంలోని ఎంఎస్ కళాశాల వెనుక నివాసముంటున్న షేక్ సల్మాన్(23) స్థానికంగా బట్టల దుకాణంలో గుమాస్తాగా పనిచేస్తున్నాడు. బుధవారం ఉదయం అతడు హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారి వెంట వాకింగ్ చేసుకుంటూ కట్టకమ్ముగూడెం క్రాస్‌రోడ్ వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఉత్తమ్‌పద్మావతినగర్ కాలనీ వద్దకు రాగానే అతడు కాలు జారి హైవే సర్వీస్ రోడ్డుపై ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌పై పడటంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి జానివియా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కోదాడ పట్టణ పోలీసులు తెలిపారు.

కల్మలచెరువులో..

గరిడేపల్లి: గరిడేపల్లి మండలం కల్మలచెరువు గ్రామంలో బుధవారం విద్యుదాఘాతంతో మహిళ మృతి చెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కల్మలచెరువు గ్రామానికి చెందిన గుండెబోయిన అచ్చమ్మ(60) తన కుమారుడు వీరయ్య వద్ద ఉంటోంది. కుమారుడు, కోడలు పనికి వెళ్తే వారి పిల్లల ఆలనాపాలన చూసుకుంటుంది. అచ్చమ్మ కుమారుడి ఇంటికి వచ్చే సర్వీస్ వైరు ఇంటి ముందు ఉన్న ఇనుప కడ్డీలను తాకుతుండగా.. బుధవారం ఆమె అది గమనించకుండా ఇనుప కడ్డీలను పట్టుకోవడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

కారు ఢీకొని వ్యక్తి దుర్మరణం



ఘటనా స్థలంలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ రవికుమార్

చిట్యాల: విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారి వెంట నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని కారు ఢీకొట్టడంతో మృతిచెందాడు. ఈ ఘటన బుధవారం చిట్యాల మండలం వెలిమినేడు గ్రామ శివారులో జరిగింది. చిట్యాల ఎస్‌ఐ మామిడి రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. అస్సాం రాష్ట్రానికి చెందిన జింటు దత్తు(31) చిట్యాల మండలం వెలిమినేడు గ్రామ పరిధిలోని హిండస్ పరిశ్రమలో సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం ఉదయం అతడు వెలిమినేడు గ్రామ శివారులోని మద్రాస్ ఫిల్టర్ కాఫీ షాపు వద్ద నుంచి విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారి వెంట నడుకుంటూ వెళ్తున్నాడు. అదే సమయంలో నార్కట్‌పల్లి వైపు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి దత్తును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దత్తు అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రూ.3వేలు.. 200 ట్రిప్పులు

ఆగస్టు 15 నుంచి కొత్తగా వార్షిక ఫాస్టాగ్

- టోల్‌ప్లాజాలకు నోటిఫికేషన్లు జారీ
- జాతీయ రహదారులపై వెళ్లే వాహనాలకు మాత్రమే అనుమతి

బీబీనగర్: టోల్‌ప్లాజాల గుండా ప్రయాణించే వాహనదారుల రాకపోకలు సులభతరం చేసేలా కేంద్ర ప్రభుత్వం నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. వాహనదారులు సాఫీగా ప్రయాణించేలా ఏడాది పాటు చెల్లు బాటు అయ్యే ఫాస్టాగ్ పాస్ సౌకర్యం కల్పించనున్నట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఇటీవల ప్రకటించారు. దీంతో టోల్‌ప్లాజాల అధికారులకు సైతం పాస్‌ల జారీకి సంబంధించి నోటిఫికేషన్లు జారీ చేశారు.

ఒక్కో టోల్‌ప్లాజా దాటితే ఒక్కో ట్రిప్..

జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులు ఒక ఏడాదికి రూ.3000 చెల్లించి ఫాస్టాగ్ పాస్ తీసుకుంటే 200 ట్రిప్పులు ఉచితంగా ప్రయాణించే సౌకర్యం కల్పించనున్నారు. ఏడాది కాలవ్యవధి ముగిసేలోపు 200సార్లు ప్రయాణించకపోయినా పాస్ కాల పరిమితి ముగుస్తుంది. ఒకవేళ ఏడాది కంటే ముందే 200 ట్రిప్పులు పూర్తయితే ఇక ఆ పాస్ పనిచేయదు. మళ్లీ రూ.3000 పెట్టి పాస్ రెన్యూవల్ చేసుకుంటే మరో ఏడాది కాలానికి 200 ట్రిప్పులు ప్రయాణించవచ్చు. ఈ విధానంలో ఒక వాహనం ఒక్కో టోల్‌ప్లాజా దాటితే ఒక్కో ట్రిప్పుగా పరిగణిస్తారు.



బీబీనగర్ మండలంలోని గూడూరు టోల్‌ప్లాజా

డబ్బులు ఆదా చేసుకోవచ్చు

జాతీయ రహదారులపై సగటున ప్రతి 60 కిలోమీటర్లకు ఒక టోల్‌ప్లాజా ఉంటుంది. నిత్యం హైవేలపై రాకపోకలు సాగించేవారు టోల్‌ప్లాజాల వద్ద ఆగకుండా ప్రయాణించాలనుకుంటే వార్షిక ఫాస్టాగ్ పాస్ ప్రయోజనకరంగా ఉంటుంది. అంతేకాకుండా టోల్‌ప్లాజాల వద్ద ట్రాఫిక్ తగ్గుతుందని రవాణా శాఖ అధికారులు భావిస్తున్నారు. నెలవారీ ఫాస్టాగ్ పాస్ చార్జీలతో పోలిస్తే వార్షిక పాస్‌లతో రూ.1000 వరకు ఆదా అవుతుందని ఒక్కో ట్రిప్‌కు రూ.15 మాత్రమే ఖర్చవుతుందని టోల్‌ప్లాజా అధికారులు చెబుతున్నారు. కమర్షియల్ వాహనదారులు వార్షిక పాస్‌లు పొందే అవకాశం లేదు. వార్షిక పాస్‌లు అమలైతే టోల్‌ప్లాజాలా వద్ద భారీ క్యూలైన్లకు మోక్షం కలగనుంది.

రాజ్‌మార్గ్ యాత్ర యాప్ ద్వారా పాస్..

ఈ వార్షిక ఫాస్టాగ్ పాస్ విధానం ఆగస్టు 15 నుంచి అమలుకానుంది. మొబైల్‌లో రాజ్‌మార్గ యాత్ర యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని అందులో వాహనదారుడు వివరాలు పొందుపర్చి పాస్‌ను పొంది రీచార్జ్ చేసుకోవచ్చు.

కమర్షియల్ వాహనాలకు వర్తించదు

వార్షిక ఫాస్టాగ్ కార్లు, జీపులు, వ్యాన్లు, నాన్ కమర్షియల్ వాహనాలకు మాత్రమే వర్తిస్తుంది. కమర్షియల్ వాహనాలకు ఈ పాస్ వర్తించదు. ఆగస్టు 15వ తేదీ నుంచి ఇది అమల్లోకి వస్తుంది. కేవలం జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనాలకు మాత్రమే పాస్ వర్తిస్తుంది. – సుధీర్, గూడూరు టోల్‌ప్లాజా మేనేజర్, బీబీనగర్ మండలం

మానవత్వం చాటుకున్న కానిస్టేబుల్

- మతిస్థిమితం లేని వృద్ధుడిని చేరదీత

మోత్కూరు: మతిస్థిమితం లేని గుర్తుతెలియని వృద్ధుడిని చేరదీసి వృద్ధాశ్రమంలో చేర్పించి మానవత్వం చాటుకున్నాడు ఓ కానిస్టేబుల్. వివరాలు.. గుర్తుతెలియని వృద్ధుడు కొద్దిరోజులుగా మోత్కూరు పట్టణంలో తిరుగుతూ భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడి ఒంటిపై బట్టలు సరిగ్గా లేకపోవడంతో పాటు ఆకలితో అలమటించేవాడు. ఇది గమనించిన మోత్కూరు పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ రామనర్సయ్య వృద్ధుడిని చేరదీసి కొత్త దుస్తులు ఇప్పించాడు. అతడికి కడుపు నిండా అన్నం పెట్టి ఆకలి తీర్చాడు. అనంతరం అతడిని జనగామ జిల్లా కడవెండి సీతారాంపురంలో గల వృద్ధాశ్రమంలో చేర్పించాడు. కానిస్టేబుల్ మానవతా స్ఫూర్తిని స్థానికులు కొనియాడారు.



వృద్ధుడికి కొత్త దుస్తులు ఇప్పించిన కానిస్టేబుల్ రామనర్సయ్య

ఉరేసుకుని గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి మండలం ఏపీ లింగోటం గ్రామ శివారులో గుర్తుతెలియని వ్యక్తి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీ లింగోటం గ్రామ శివారు లోని పెద్దగుట్టపై గల కుంకుడు చెట్టుకు గుర్తుతెలియని వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం గ్రామ రైతులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు, గ్రామ పంచాయతీ కార్యదర్శి సైదారెడ్డికి సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడికి సుమారు 45ఏళ్లు ఉంటాయని, దాదాపు నెల రోజుల క్రితమే ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని పోలీసులు తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ యాదగిరి తెలిపారు.

జాబ్ క్యాలెండర్ ద్వారా లైబ్రేరియన్ పోస్టుల భర్తీ

- రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ ఎండీ రియాజ్

భూదాన్‌పోచంపల్లి: రాబోయే జాబ్ క్యాలెండర్ ద్వారా రాష్ట్రంలో ఖాళీగా ఉన్న లైబ్రరియన్ పోస్టులను భర్తీ చేస్తామని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ ఎండీ రియాజ్ అన్నారు. బుధవారం పోచంపల్లిలోని శాఖా గ్రంథాలయాన్ని ఆయన సందర్శించి అక్కడ వసతులు, పుస్తకాలను పరిశీలించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణలో 600 గ్రంథాలయాలు ఉన్నాయని, వన్‌మ్యాన్ కమిషన్ వేసి రాష్ట్రంలో 750 లైబ్రేరియన్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు గుర్తించామన్నారు. దశలవారీగా ఈ పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. 80వేల పుస్తకాలు చదివానన్న కేసీఆర్ గత పదేళ్లలో గ్రంథాలయాలకు 8 పుస్తకాలు కూడా కొనివ్వలేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ రాజారామ్మోహన్‌రాయ్ ఫౌండేషన్ ద్వారా వచ్చే నిధులన్నింటినీ గ్రంథాలయాల్లో పుస్తకాల కొనుగోలుకు వినియోగిస్తామని చెప్పారు. అదేవిధంగా ప్రతి జిల్లా కేంద్రంలో గ్రంథాలయాలను పటిష్టం చేస్తామన్నారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు సెస్ వసూల్ చేస్తున్నా, గ్రంథాలయాలకు చెల్లించడంలేదని అన్నారు. దీనిపై త్వరలో సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాస్తానని పేర్కొన్నారు. భూదాన్‌పోచంపల్లి గ్రంథాలయాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా గ్రంథాలయ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. పోచంపల్లికి వివిధ ప్రాంతాలు, దేశాల నుంచి పర్యాటకులు వస్తుంటారని.. వారికి ఈ ప్రాంతం గొప్పతనం తెలియజెప్పేందుకు గ్రంథాలయం ఒక వేదిక కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ కార్యదర్శి సుధీర్, నాయకులు తడక వెంకటేశం, కొట్టం కరుణాకర్‌రెడ్డి, తడక యాదగిరి, రాపోలు జ్ఞానేశ్వర్, మక్తాల నర్సింహ, చింతకుంట్ల కృష్ణారెడ్డి, జయసూర్య, ఆకుల శోభ, సుచిత్ర పాల్గొన్నారు.



పోచంపల్లి గ్రంథాలయంలోని పుస్తకాలను పరిశీలిస్తున్న ఎండీ రియాజ్

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

రాజ్యాంగ పరిరక్షణ మనందరి బాధ్యత అని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ ఎండీ రియాజ్ అన్నారు. నిజాం కాలేజ్ ప్రొఫెసర్ తడక యాదగిరి రూపొందించిన అనువాద రాజ్యాంగ సంకలన పుస్తకాన్ని బుధవారం పోచంపల్లిలోని అర్బన్ బ్యాంకు ఆడిటోరియంలో ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రాజ్యాంగం పట్ల ప్రజల్లో మరింత చైతన్యం కల్పించడానికి తడక యాదగిరి సరళమైన భాషలో సంకలం చేసి రాజ్యాంగ పుస్తకాన్ని తీసుకరావడం అభినందనీయమన్నారు. ఈ పుస్తకాన్ని రాష్ట్రంలోని అన్ని గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంచుతామని చెప్పారు. అనంతరం బ్యాంకు పాలకవర్గం ఆయనను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ బ్యాంకు చైర్మన్ తడక రమేశ్, వైస్ చైర్మన్ భారత రాజేంద్రప్రసాద్, చేనేత నాయకులు తడక వెంకటేశం, సీఈఓ సీత శ్రీనివాస్, తడక యాదగిరి, రాపోలు జ్ఞానేశ్వర్, బ్యాంకు డైరెక్టర్లు ఏలే హరిశంకర్, రాపోలు వేణు, కె. ఎల్లస్వామి, మక్తాల నర్సింహ, గునిగంటి రమేశ్, చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు అంకం పాండు, సీత సత్యనారాయణ పాల్గొన్నారు.



రాజ్యాంగ సంకలన పుస్తకం ఆవిష్కరిస్తున్న రియాజ్ తదితరులు

పాలు పొంగించి.. పట్టువస్త్రాలు అందజేసి..

- ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారుకి గొర్రె పొట్టేలు అందజేసిన ప్రభుత్వ విప్ ఐలయ్య

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట మండలం సైదాపురం గ్రామంలో బుధవారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కలిసి ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాల కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎగ్గిడి స్వప్న, బాలమల్లేష్ దంపతుల ఇంట్లోకి మంత్రి, విప్ కలిసి రిబ్బన్ కట్ చేసి గృహప్రవేశం చేశారు. ఆ తర్వాత ఇంట్లో పాలు పొంగించి, ప్రత్యేక పూజలు చేశారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు స్వప్న, బాలమల్లేష్ దంపతులకు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సమక్షంలో గొర్రె పొట్టేలు, పట్టువస్త్రాలు కానుకగా అందజేశారు. లబ్ధిదారులు త్వరగా ఇళ్లను పూర్తిచేసుకుని బహుమతులు పొందాలని ఐలయ్య చెప్పారు.

గృహప్రవేశాలకు రావడం ఆనందంగా ఉంది

ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశానికి రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. గత ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు, దళితులకు మూడెకరాల భూమి ఇస్తామని చెప్పి మోసం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన 18 నెలల్లోపే నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చిందని అన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు, అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ అయినాల చైతన్యరెడ్డి, దుంబాల వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, బీర్ల శంకర్, శిఖ ఉపేందర్, గుండ్లపల్లి భరత్‌గౌడ్, ముఖ్యర్ల మల్లేష్, ఎరుకల హేమేందర్, బందారపు భిక్షపతి, కాల్నె భాస్కర్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారుడికి గొర్రె పొట్టేలు ఇస్తున్న మంత్రి లక్ష్మణ్‌కుమార్, విప్ ఐలయ్య, చిత్రంలో కలెక్టర్



లబ్ధిదారుడి ఇంట్లో పాలు పొంగిస్తున్న మంత్రి లక్ష్మణ్‌కుమార్, ప్రభుత్వ విప్ ఐలయ్య

యాదగిరీశుడి సేవలో అడ్లూరి..

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ బుధవారం ఉదయం దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు సంప్రదాయంగా స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్టా అలంకారమూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తుల చెంత అష్టోత్తర, సువర్ణ పుష్పార్చన పూజల్లో పాల్గొన్నారు. మంత్రికి ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా, ఈఓ వెంకట్రావ్ లడ్డూ ప్రసాదం, స్వామివారి చిత్రపటం అందజేశారు. మంగళవారం రాత్రే మంత్రి యాదగిరిగుట్టకు చేరుకుని కొండ దిగువన ఉన్న ప్రెసిడెన్షియల్ సూట్‌లో బస చేశారు.

మంత్రికి ఘన స్వాగతం..

మంత్రి పదవి చేపట్టిన తర్వాత మొదటిసారి యాదగిరీశుడిని దర్శించుకునేందుకు వచ్చిన అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు, ఆలయ ఈఓ వెంకట్రావ్ ఆధ్వర్యంలో కొండ పైన ఘన స్వాగతం పలికారు. వారి వెంట వెంట డీసీసీ అధ్యక్షుడు సంజీవరెడ్డి, మదర్ డెయిరీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ చైతన్యరెడ్డి, నాయకులు బాల రాజుగౌడ్, గుండ్లపల్లి భరత్‌గౌడ్, ముక్కెర్ల మల్లేశం, బందారపు భిక్షపతి తదితరులున్నారు.



మంత్రి లక్ష్మణ్‌కుమార్‌కు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఈఓ వెంకట్రావ్

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

నడిగూడెం: నడిగూడెం మండలం కాగితరామచంద్రాపురం సమీపంలో సాగర్ ఎడమ కాల్వ వంతెన వద్ద బుధవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌ఐ గందమళ్ల అజయ్‌కుమార్ తెలిపారు. గ్రామానికి చెందిన పలువురు అటుగా వెళ్తూ మృతదేహాన్ని గమనించి తమకు సమాచారం ఇచ్చినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించామని, గుర్తుతెలియని వ్యక్తులు అతడి చేతులు కట్టేసి, ఉరి వేసి హత్య చేసి నీటి కుంటలో పడేసినట్లుగా తెలుస్తుందన్నారు. మృతుడి వయస్సు 20 నుంచి 30 ఏళ్లు ఉంటాయని, అతడి కుడి చేతికి స్టీల్ కడియం ఉందని, గులాబీ రంగు చొక్కా, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఘటనా స్థలాన్ని కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, మునగాల సీఐ రామకృష్ణారెడ్డి పరిశీలించారు.

వివాహిత హత్యకు ఆర్థిక వ్యవహారాలే కారణమా..?

గుర్రంపోడు: మండలంలోని జూనూతుల గ్రామంలో వివాహిత జ్యోతిని ఆర్‌ఎంపీ వైద్యుడు హత్య చేసిన ఉదంతంలో కొత్త కోణం వెలుగులోకి వచ్చినట్లు పలువురు చర్చించుకుంటున్నారు. కాగా ఇద్దరి మధ్య ఉన్న సన్నిహిత సంబంధంతో పాటు మృతురాలు నిందితుడికి డబ్బు అప్పుగానో, చేబదులుగానో పెద్ద మొత్తంలో ఇచ్చి ఉంటుందని, తిరిగి ఇవ్వమని ఆమె ఒత్తిడి చేయడంతో నిందితుడు ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటాడని పలువురు అనుమానిస్తున్నారు. ఈ కోణంలో కూడా పోలీసులు విచారణ జరిపినట్లు తెలుస్తోంది. కేవలం తనను బెదిరిస్తున్నందుకే హత్య చేశానని నిందితుడు చెబుతుండటాన్ని విశ్వసించక మరింత లోతుగా పలు కోణాల్లో పోలీసులు దర్యాప్తు జరిపారు. కాగా గురువారం హత్య కేసు వివరాలు వెల్లడిస్తామని పోలీసు అధికారులు చెబుతున్నారు.

ఆర్టీసీ బస్సుకు తృటిలో తప్పిన ప్రమాదం

- రోడ్డు పక్కన దిగబడిన బస్సు

నడిగూడెం: కోదాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సుకు నడిగూడెం మండలం చాకిరాల వద్ద బుధవారం తృటిలో ప్రమాదం తప్పింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. నడిగూడెం నుంచి అనంతగిరి మండలం శాంతినగర్ వరకు డబుల్ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. కోదాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ప్రతిరోజు ఆకుపాముల మీదుగా నడిగూడెం మండలం తెల్లబల్లి, ఎకలాస్‌ఖాన్‌పేట, రామాపురం, చాకిరాల గ్రామాలకు చెందిన విద్యార్థులను కరివిరాల మోడల్ స్కూల్‌కు తీసుకెళ్తుంది. చాకిరాల వద్ద రోడ్డు నిర్మాణంలో భాగంగా చేపట్టిన వంతెనపై సంబంధిత కాంట్రాక్టర్ సరిగ్గా మట్టి పూడ్చకపోవడంతో బస్సు రహదారి దిగి వెళ్తుండగా.. వంతెన వద్ద దిగబడింది. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో ప్రమాదం తప్పింది. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే ఈ ఘటన జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.



చాకిరాల వద్ద రోడ్డు పక్కన దిగబడిన ఆర్టీసీ బస్సు

మిరప సాగుకు అనువైన సమయం ఇదే..

- ఉద్యానవన శాఖ అధికారి మురళి సూచనలు

పెద్దవూర: తొలకరి వర్షాలు పడుతుండగా మిరప పంట సాగు చేసుకునేందుకు అనువైన సమయమని ఉద్యానవన శాఖ అధికారి మురళి వివరించారు. మిరప పంటలో యాజమాన్య పద్ధతుల గురించి ఆయన మాటల్లోనే..

అనువైన నేలలు

మిరప సాగుకు ఉదజని సూచిక(పీహెచ్) 6 నుంచి 6.5 ఉన్న నేలలు అనుకూలం. వర్షాధారపు పంటకు నల్లరేగడి నేలలు, నీటి ఆధారపు పంటకు నల్ల, ఎర్ర, చల్క నేలలు, ఇసుకతో కూడిన ఒండ్రు నేలలు, అనుకూలం.

వాతావరణం, విత్తే సమయం

మిరప పంట అన్నిరకాల వాతావరణ పరిస్థితులను తట్టుకోగలదు. అయితే మిరపకు 10 నుంచి 35 డిగ్రీల ఉష్ణోగ్రత అనుకూలం. ఎండు మిరపను వానాకాలం సీజన్‌లో వేసుకోవడం మంచిది. పచ్చి మిరపను సంవత్సరం పొడవునా సాగు చేసుకోవచ్చు. సాధారణంగా మిరప పంటను ఖరీఫ్ సీజన్‌లో జూలై, ఆగస్టు నెలల్లోనూ, యాసంగిలో అయితే అక్టోబర్, నవంబర్ నెలల్లో సాగు చేసుకోవచ్చు.

నేల తయారీ

పొలాన్ని వేసవిలో లోతుగా దున్ని, ఆఖరి దుక్కిలో ఎకరానికి 10 టన్నుల పశువుల ఎరువు, 20 కిలోల వేప పిండి, 150 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ వేయాలి. అలాగే 90 కిలోల పశువుల ఎరువు, 10 కిలోల వేపపిండి, 2కిలోల ట్రైకోడెర్మావిరిడి శిలీంద్రపు పొడిని కలిపి 10–15 రోజులు నీడలో ఉంచి శిలీంద్రం వృద్ధి చెందిన తర్వాత ఆఖరి దుక్కిలో వేస్తే తొలి దశలో మొక్కలను ఆశించే తెగుళ్ల నుంచి కాపాడవచ్చు. పోషకాల శాతాన్ని పెంచుకోవడానికి ముందుగా పచ్చిరొట్ట లేదా మినుము పంటను వేసుకుని భూమిలో కలియ దున్నాలి. దీని వలన భూమికి సహజ పోషకాలు లభిస్తాయి. 10–15 రోజుల తర్వాత కల్టివేటర్‌తో నేల మెత్తగా దుక్కి అయ్యే వరకు 1–3 సార్లు దున్నుకోవాలి.



ప్రో ట్రేలలో పెరుగుతున్న మిరప నారు

విత్తనశుద్ధి

విత్తనశుద్ధి ద్వారా విత్తనం నుంచి వ్యాపించే చీడపీడల నుంచి పంటను రక్షించవచ్చు. మిరప విత్తనాలను మూడు రకాలుగా విత్తనశుద్ధి చేసుకోవచ్చు. తెగుళ్ల నివారణకు కిలో విత్తనానికి 150గ్రాముల ట్రైసోడియం ఆర్థోఫాస్ఫేట్‌ను ఒక లీటరు నీటిలో కరిగించి 15 నుంచి 20 నిమిషాల పాటు విత్తనాన్ని నానబెట్టి తర్వాత నీటిని తీసివేసి మంచి నీటితో శుభ్రంగా కడిగి విత్తనాలను నీడలో ఆరబెట్టుకోవాలి. రసం పీల్చు పురుగుల నివారణకు గాను కిలో విత్తనానికి 8గ్రాముల ఇమిడాక్లోప్రిడ్‌ను విత్తనాలకు పట్టించాలి. దీని వలన విత్తిన 20–25 రోజుల వరకు రసం పీల్చు పురుగుల ఉధృతి నివారణ జరుగుతుంది. బ్యాక్టీరియా, బూజు తెగుళ్ల నివారణకు గాను కిలో విత్తనానికి 3గ్రాముల మాంకోజెబ్ లేదా కాప్టాన్ మందును పట్టించి విత్తుకోవాలి. చివరిగా అదే విత్తనాన్ని ట్రైకోడెర్మా విరిడి అనే శిలీంద్రం పొడిని 5–10 గ్రాముల విత్తనానికి పట్టించి నారుమడిలో విత్తుకోవాలి.

విత్తన మోతాదు

మిరపను రెండు పద్ధతుల్లో సాగు చేయవచ్చు. మిరప విత్తనాలను నేరుగా విత్తడానికి అయితే ఎకరాకు 2.5 కిలోల విత్తనం సరిపోతుంది. నారు పెంచుటకు విత్తన మోతాదు సూటి రకాలకు 650గ్రా., హైబ్రిడ్ రకాలైతే 75 నుంచి 100గ్రా. విత్తనం సరిపోతుంది.

నారు పెంచే విధానం

మిరప నారును రెండు పద్ధతుల్లో పెంచవచ్చు. మిరప నారు పెంచేందుకు సారవంతమైన ఒండ్రునేలలు, నీటి వసతి, ఒక మోస్తారు నీడ కలిగిన ప్రదేశాలు చాలా అనుకూలం. ఒక మీటరు వెడల్పు, 40 మీటర్ల పొడవు, 15 సెం.మీ. ఎత్తుగల మడిలో ఒక ఎకరంలో నాటడానికి అవసరమైన నారు పెంచుకోవచ్చు. నారు పెంచటానికి నేలకు కొంచెం ఎత్తులో మట్టిని బెడ్డుగా చేసుకోవాలి. నాలుగు మూలలు సమాన ఎత్తులో ఉండేలా చూసుకోవాలి. నారుమళ్లలో విత్తనాలను 5 నుంచి 8 సెం.మీ. మధ్య దూరం, 1.5 సెం.మీ. లోతులో వరుసల్లో విత్తనాలను పలుచగా విత్తుకోవాలి. విత్తిన 9వ రోజు, 13వ రోజున లీటర్ నీటిలో 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను కలిపిన ద్రావణంలో నారుమళ్లను తడపాలి.

కలుపు యాజమాన్యం

కలుపు నివారణకు మొక్కలు నాటిన 20–25 రోజుల తర్వాత కలుపు గొర్రు లేదా గుంటుకలను ప్రతి 15–20 రోజులకు ఒక్కసారి దున్నాలి. ఇలా మొక్క నేల మొత్తాన్ని కప్పివేసే వరకు 4–5 సార్లు దున్నాలి. మొక్కలను నాటుకునే 1–2 రోజుల ముందు లీటర్ నీటిలో 1.5మిల్లీలీటర్ల పెండివిథాలిన్ కలుపుకుని పిచికారీ చేసుకోవాలి. పంటలో కలుపు మొక్కలు ఉన్నట్లయితే మొక్కలు నాటిన 25 రోజుల తర్వాత ఎకరానికి 400–500 మిల్లీలీటర్ల క్విజాలోఫాస్ ఇథైల్‌ను మొక్కలపై పడకుండా జాగ్రత్తగా పిచికారీ చేసుకోవాలి.

అంతర పంటలు

పంట మార్పిడి విధానాన్ని అవలంబిస్తూ, మిరప చేను చుట్టూ రక్షణ పంటలుగా హైబ్రిడ్ జొన్న లేదా మొక్కజొన్నను రెండు లేదా మూడు సాళ్లలో వేయాలి. కీటక ఆకర్షణ(ఎర) పంటలుగా బంతి, ఆముదాన్ని పొలంలో అక్కడక్కడా వేయాలి.

ప్రోట్రేలలో నారును పెంచే విధానం

ఈ పద్ధతిలో ప్రతి విత్తనం సమానంగా, ఆరోగ్యంగా పెరిగి పంట ఒకేసారి కాపునకు వస్తుంది. నారు ధృడంగా పెరగడంతో పాటు నారుకుళ్లు, వైరస్ తెగుళ్లను ఆశించే అవకాశం తక్కువగా ఉంటుంది. ఎకరా పొలంలో నాటుటకు 98 సెల్స్ కలిగిన 120 ట్రేలు సరిపోతాయి. ఒక్కో ప్రోట్రేను నింపుటకు సుమారు 1.2 కిలోల కోకోపిట్ మిశ్రమం అవసరం. ఒక్కొక్క సెల్‌లో ఒక్క విత్తనం నాటుకుని తిరిగి కోకోపిట్‌తో కప్పుకోవాలి. 6రోజుల తర్వాత మొక్క మొలకెత్తడం ప్రారంభమయ్యాక వీటిని ఎత్తైన బెడ్లలోకి మార్చుకోవాలి.

మొక్కలను నాటుకునే విధానం

మొక్కలను నీటి వసతి నేలల్లో నాటుకునేప్పుడు 24×24 లేదా 26×26 లేదా 28×28 అంగుళాల దూరంలో నేల స్వభావాన్ని బట్టి నాటుకోవాలి. మొక్కలు పెట్టడానికి తీసిన రంధ్రాల్లో కొద్దిగా నీరు పోసి వేర్లు మడత పడకుండా నాటుకోవాలి. డ్రిప్ పద్ధతిలో నాటుకునేటప్పుడు మొక్కల మధ్య దూరం 30–45 అంగుళాలు ఉండాలి.